
సాక్షి ఒడిశా

బుధవారం । 22 । మార్చి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.3,30,993
బంగారం	1 గ్రాము 900 మిల్లీ గ్రాములు
వెండి	12 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



ఎన్‌పీఎస్ రద్దుకు డిమాండ్

- 4లో▸



మహాలక్ష్మిగా తరతరణి

- 4లో▸

గంజాంలో 26న సీఎం పర్యటన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా, ఎస్పీ జగ్‌మోహన్ మీనా తదితరులు

బరంపురం: ఈనెల 26వ తేదీన సీఎం నవీన్ పట్నాయక్ గంజాం జిల్లాలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. పర్యటనలో భాగంగా జిల్లాలోని తన సొంత నియోజకవర్గం హింజిలికాట్‌లో సైన్స్ కళాశాల క్రీడా మైదానానికి భువనేశ్వర్ నుంచి ప్రత్యేక హెలిప్యాడ్‌లో చేరుకుంటారు. అక్కడ నుంచి హింజిలికాట్ నియోజకవర్గం పరిధిలోని కభిసూర్యనగర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. అనంతరం అక్కడ నుంచి ఛత్రపూర్ చేరుకొని పలు ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఈ మేరకు కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా, గంజాం ఎస్పీ జగ్‌మోహన్ మీనా ఏర్పాట్లను పరిశీలించారు.

మాతాశిశు మరణాలు తగ్గుతున్నాయి

- ఆశా కార్యకర్తల సేవలు అమోఘం
- జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ కుమార్ పాత్రో



వేదికపై అధికారులు, నాయకులు

పర్లాకిమిడి: జిల్లాలో ప్రస్తుతం మాతాశిశు మరణాలు తగ్గడానికి ఆశా కార్యర్తల సేవలే కారణమని జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ కుమార్ పాత్రో అన్నారు. స్థానిక బిజూ కల్యాణ మండపంలో జిల్లా స్థాయి ఆశావర్కర్లు, ఆరోగ్య కార్యకర్తల గావ్ కల్యాణ సమితి వార్షిక సమ్మేళనం 2023ను అదనపు జిల్లా మెజిస్ట్రేట్ సంగ్రాం శేఖరపండా, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదీప్ కుమార్ పాత్రో మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య కార్యకర్తలు అనేక సేవలు అందిస్తున్నారన్నారు. వీరికి ఏడాదికొకసారి సత్కారాలు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఏడీఎం సంగ్రాం మాట్లాడుతూ.. గజపతి జిల్లాలో 18 ఏళ్లలోపు దివ్యాంగులకు ఉన్నత చికిత్సలు అందజేస్తున్నామన్నారు. బిజూ స్వస్థ్య కల్యాణ యోజనా పథకం కింద అనేక మంది కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆపరేషన్లు, చికిత్సలు చేయించుకుంటున్నారని తెలియజేశారు. పర్లాకిమిడిలో 34 మంది ఆరోగ్య కార్యకర్తలు పనిచేస్తున్నారన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరచిన ఆశవర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలను సత్కరించారు. కార్యక్రమానికి జిల్లా హెల్త్ ప్రాజెక్టు మేనేజర్ సౌమ్యరాణి గౌడో ముఖ్య వక్తగా వ్యవహరించగా, డీఆర్‌డీఏ కార్యనిర్వాహక అధికారి రమాంచల్ ఖమారి, గౌరవ అతిథి పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెట్టి పాల్గొన్నారు.



ఆశ వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తల సాంస్కృతిక నృత్యాలు

క్లుప్తంగా

ప్రాణాలు కాపాడిన లైఫ్ గార్డులు



పర్యాటకుడిని ఒడ్డుకు తీసుకొస్తున్న లైఫ్ గార్డుల బృందం

భువనేశ్వర్: పూరీ సముద్రంలో అలల తాకిడికి గురైన ఇద్దరు పర్యాటకులను లైఫ్ గార్డులు రక్షించి ప్రాణాలతో ఒడ్డుకు చేర్చారు. ఈ ఇద్దరు పర్యాటకులు బీచ్ సెక్టార్ 13లోని హోటల్ కెమెలియా ప్రాంతం తీరంలో మంగళవారం స్నానం చేస్తుండగా పెద్ద అల రావడంతో సముద్రంలోకి కొట్టుకుపోయారు. వెంటనే అక్కడే ఉన్న లైఫ్ గార్డులు ఈ పరిస్థితిని గమనించి సముద్రంలోనికి వెళ్లి ఇద్దరినీ రక్షించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. అనంతరం ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. పర్యాటకులు పశ్చిమ బెంగాల్‌కు చెందిన దిలీప్ సామంత, మంటూ మన్నాగా గుర్తించారు.

శిక్షణ తరగతులు ప్రారంభం



వాలంటీర్లకు శిక్షణ ఇస్తున్న అధికారులు

పర్లాకిమిడి: ఒడిశా విపత్తుల నిర్వహణ అథారిటీ (ఓఎస్‌డీఎంఏ) ఆధ్వర్యంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ రిసోర్సు కేంద్రంలో ఆపద మిత్ర వాలంటీర్ల రెండో బ్యాచ్ శిక్షణ మంగళవారం నుంచి ప్రారంభమైంది. వాలంటీర్లకు వరదలు వచ్చినప్పుడు గాలి రబ్బర్ బోట్‌ను ఎలా ఉపయోగించాలో ఎమర్జెన్సీ అధికారులు వివరించారు. భువనేశ్వర్ నుంచి వచ్చిన అధికారులు లైఫ్ బోట్, రబ్బర్ బోట్‌ను నడిపే విధానంలో ప్రాక్టికల్‌గా శిక్షణ ఇప్పించారు. శిక్షణ తరగతుల్లో 25 మంది యువతీ, యువకులు పాల్గొన్నారు. జిల్లా ప్రోగ్రాం అధికారి ప్రదోష్ కుమార్ శతపతి ఇతర శిక్షణ అధికారులు పర్యవేక్షించారు.

కేఫ్ ప్రారంభం



మల్కన్‌గిరి: స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం దగ్గరలో మిషన్ శక్తి స్వచ్ఛంద సంస్థకు చెందిన మహిళలు ఒక కేఫ్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ కేఫ్‌లో విధి నిర్వహణలో ఉండే ఉద్యోగులకు తక్కువ ధరకే టీ, టిఫిన్, భోజనం అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో మిషన్ శక్తి సంస్థ అధ్యక్షుడు టి.నిరంజన్, మల్కన్‌గిరి అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ మనాస్ కుమార్ మిశ్రో, హిమాంశ్ మహరణ తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మిగా తరతరణి



మహాలక్ష్మిగా దర్శనమిస్తున్న తరతరణి అమ్మవారు



విద్యుత్ కాంతుల్లో తరతరిణి అమ్మవారి ఆలయం



కొండపై కిక్కిరిసిన భక్తులు



అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు



కొండపైకి వెళ్తున్న భక్తజన సందోహం



చిన్నారుల తలనీలాలు సమర్పిస్తున్న దృశ్యం

దక్షిణ ఒడిశా ప్రజల ఆరాధ్య దైవం, రుశికుల్యా నదీతీరంలో కొండపై వెలిసిన తరతరణి అమ్మవారికి చైత్రమాసం రెండో మంగళవారం సందర్భంగా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవారు మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఒడిశాలోని వివిధ జిల్లాలతో పాటు పక్కరాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. తలనీలాలు, ముడుపులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొండ దిగువున వంటావార్పులు చేసుకొని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి మధ్యాహ్నం రాజభోగం, సాయంత్రం సంధ్యా హరతి, రాత్రి బెడా చేపట్టి మేళ తాళాలతో ఊరేగింపు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

– బరంపురం

ఎన్‌పీఎస్ రద్దుకు డిమాండ్



ఖుర్దారోడ్‌లో ఎన్‌జేసీఏ ర్యాలీ

- ఎన్‌జేసీఏ ఆధ్వర్యంలో కార్యచరణ
- దశలవారీగా ఉద్యమం చేసేందుకు నిర్ణయం



మాట్లాడుతున్న పటసహాణి తదితరులు

భువనేశ్వర్: జాతీయ పింఛన్ స్కీమ్(ఎన్‌పీఎస్)ను రద్దుచేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఉద్యమం వేడెక్కింది. జాతీయ స్థాయిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలతో సంయుక్తంగా జాతీయ సంయుక్త కార్యాచరణ మండలి(ఎన్‌జేసీఏ) ఏర్పాటైంది. తూర్పు కోస్తా రైల్వే శ్రామిక్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.కె.పటసహాణి నేతృత్వంలో ఈ వర్గం జాతీయ స్థాయిలో ఆందోళనకు నడుం బిగించింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఖుర్దారోడ్ రైల్వే వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించి, స్థానిక మండల రైల్వే అధికారి డీఆర్‌ఎం రింకేష్ రాయ్‌కు ఎన్‌జేసీఏ 8 మంది సభ్యుల బృందం పాత పింఛను వ్యవస్థ పునరుద్ధరణ నినాదంతో వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా పటసహాణి మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా రైల్వే, పోస్టల్, ఆదాయ పన్ను ఇతరేతర కేంద్ర ప్రభుత్వ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయుల మహా సంఘం ఇతర వర్గాలు సంయుక్త ఉద్యమంలో పాల్గొంటాయని తెలియజేశారు. జాతీయ స్థాయిలో 6 రాష్ట్రాలు జాతీయ పింఛన్ వ్యవస్థ రద్దు చేసి, పాత పింఛన్ వ్యవస్థని పునరుద్ధరించినా, కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో జాతీయ ఉద్యమానికి శంఖారావం చేసినట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా ఏప్రిల్ 26వ తేదీన భువనేశ్వర్‌లో భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలియజేశారు. శాంతియుతంగా చేపడుతున్న ఆందోళనపై కేంద్ర ప్రభుత్వం స్పందించకుంటే నిరవధిక సమ్మె చేపట్టేందుకు వెనుకాడేది లేదని ప్రకటించారు. ఆయనతో పాటు ఎన్‌జేసీఏ బృహస్పతి సామల్, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఆర్.ఎన్.ధల్, చిత్త రంజన్ పట్నాయక్, ప్రశాంత కుమార్ పండా, ప్రతాప్ చంద్ర మిశ్రా, అఖిల కుమార్ బ్రహ్మ తదితరులు పాల్గొన్నారు.

ఓఏటీ రద్దు సరైనదే

- సమర్థించిన సుప్రీంకోర్టు

భువనేశ్వర్: ఒడిశా అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (ఓఏటీ)ను రద్దు చేస్తూ 2019లో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం సమర్థించింది. ఒడిశా అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ రద్దును సమర్థించిన హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ, ఒడిశా అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ బార్ అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్ కొట్టివేస్తూ భారత ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ తుది తీర్పు వెల్లడించారు. ట్రిబ్యునల్ రద్దు చెల్లుబాటు అవుతుందన్నారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 323–ఏ ప్రకారం కేంద్ర ప్రభుత్వం స్టేట్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ రద్దు చేయవచ్చని పేర్కొన్నారు. ట్రిబ్యునల్ రద్దు చేసేందుకు జనరల్ క్లాజుల చట్టంలోని సెక్షన్ 21ను కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం సరైనదేనని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 14 ట్రిబ్యునల్ రద్దును వ్యతిరేకించదని స్పష్టం చేశారు.

22 కేజీల గంజాయి పట్టివేత

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి గొడిగూఢ గ్రామం వద్ద మంగళవారం మధ్యాహ్నం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సమయంలో అతివేగంగా వెళ్తున్న ఒక స్కూటీని ఆపి తనిఖీ చేయగా, 22 కేజీల గంజాయి పట్టుబడింది. వెంటనే పోలీసులు స్కూటీని స్వాధీనం చేసుకొని, నడుపుతున్న వ్యక్తిని అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తి ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఇబ్లాక్ (33)గా విచారణలో తెలిసింది. గంజాయిని బలిమెల వద్ద కొని మల్కన్‌గిరి తీసుకొచ్చి, బస్సులో తరలించాలని ప్రయత్నించగా పోలీసులకు పట్టుబడ్డాడు. అతని వద్ద నుంచి రూ.800 నగదు, రెండు సెల్‌ఫోన్లు సైతం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

మమతా బెనర్జీకి ఘన స్వాగతం



అభివాదం తెలుపుతున్న పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

భువనేశ్వర్: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మూడు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం రాష్ట్రానికి విచ్చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున క్రీడలు, హోం శాఖ సహాయ మంత్రి తుషారకాంతి బెహరా స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆమెకు స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి ప్రత్యేక పోలీసు ఎస్కార్ట్‌తో రోడ్డు మార్గంలో ఆమె పూరీ వెళ్లారు. ఈనెల 23వ తేదీన సీఎం నవీన్ పట్నాయక్‌తో సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. మమతా బెనర్జీ పూరీలో రెండు రాత్రులు బస చేస్తారు. బుధవారం మధ్యాహ్నం జగన్నాథ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజాదుల్లో పాల్గొంటారని పూరీ జిల్లా కలెక్టర్ సమర్థ్ వర్మ తెలిపారు. ప్రోటోకాల్ ప్రకారం పూరీ జిల్లా యంత్రాంగం భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పోలీసు సూపరింటెండెంట్ కె.వి.సింగ్ తెలిపారు. పర్యటనలో భాగంగా పశ్చిమ బెంగాల్ భక్తుల కోసం పూరీలో భక్త నివాస్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం 23వ తేదీన భువనేశ్వర్ నుంచి కోల్‌కతాకు తిరుగు ప్రయాణానికి ముందు, ఆమె నవీన్ పట్నాయక్‌ను కలిసే అవకాశం ఉంది. అయితే ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు ఇంతవరకు ధ్రువీకరించలేదు.

మావో డంప్ స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న డంప్‌లో వస్తువులు

మల్కన్‌గిరి: జిల్లా పోలీసులు సోమవారం రాత్రి కూబింగ్ నిర్వహించి తిరిగి వస్తున్న సమయంలో, ఆంధ్ర–ఒడిశా సరిహద్దుల్లో ఉన్న కూసుమ్‌పూట్ గ్రామ అడవిలో మావోలు అమర్చిన డంప్‌ను మంగళవారం ఉదయం స్వాధీనం చేసుకున్నారు. దీనిలో 60 కేజీల కోడెక్స్ వైర్, ఆరు టిఫిన్ బాంబులు, రెండు వాకీటాకీలు తదితర సామగ్రి ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయంపై ఎస్పీ నితీష్ వాద్వనీ మాట్లాడుతూ మావోలు ఉనికి చాటుకునేందుకు డంప్‌ను అమర్చి జవాన్లను టార్గెట్ చేస్తున్నారన్నారు. డంప్ స్వాధీనం చేసుకున్న పోలీసులకు అభినందనలు తెలిపారు. ఆ ప్రాంతంలో కూంబింగ్ ముమ్మరం చేశారు.

నారాయణవలస సంత ఆశీలు వేలం ఖరారు

కోటబొమ్మాళి: మండలంలోని నారాయణవలస (గురువారపు) సంత ఆశీలు వేలం పాట రూ.90 లక్షల 5 వేలకు ఖరారైంది. మంగళవారం కోటబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.ఫణీంద్రకుమార్, ఈఓపీఆర్డీ తులా రాజారావు, వెటర్నరీ ఏడీ ఎం.లోకనాథం, ఎస్‌ఐ షేక్ మహమ్మద్ అలీ ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా జలుమూరు మండలం పెద్దదూగాం గ్రామానికి చెందిన యాళ్ల రాము పాట దక్కించుకున్నారు. గత ఏడాది రూ.56లక్షల 5 వేలకు పాట ఖరారుకాగా ఈ ఏడాది అదనంగా రూ.34 లక్షలు రావడం విశేషం. కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ రాజేశ్వరమ్మ, సీనియర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

భయం నీడలో..!



పాఠశాల వాతావరణం విద్యార్థుల చదువులపై ప్రభావం చూపుతుంది. అందమైన, పరిశుభ్రమైన పాఠశాలలు విద్యా వికాసానికి తోడ్పాటునందిస్తాయి. అయితే కొరాపుట్ జిల్లాలో మాత్రం పాఠశాలల పరిస్థితి దారుణంగా ఉంది. ముఖ్యంగా అక్షరాస్యతలో వెనుకబడి ఉన్న బొయిపరిగుడ సమితిలో పాఠశాలల నిర్వహణలో అనేక లోపాలు కనిపిస్తున్నాయి. బొయిపరిగుడ సమితి ఛత్తీష్‌ఘడ్ సరిహద్దులో ఉన్న దండాబడి పంచాయతీ పురువాగుడ గ్రామంలో ప్రాథమిక పాఠశాల పైకప్పు ఎప్పుడు పడిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. పైకప్పుకు కర్రదుంగను అడ్డుగా పెట్టి చదువులు కొనసాగిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

– జయపురం

విద్యుత్ ఛార్జీలు పెంచవద్దు

- ఓఈఆర్‌సీకి ప్రభుత్వ ప్రతిపాదన

భువనేశ్వర్: ఈ ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ ఛార్జీలను పెంచవద్దని రాష్ట్ర ప్రభుత్వం ఒడిశా విద్యుత్ నియంత్రణ కమిషన్(ఓఈఆర్‌సీ)కి ప్రతిపాదించింది. రాష్ట్రంలో విద్యుత్ మిగులు ఉత్పాదన కొనసాగుతున్న పరిస్థితుల్లో విద్యుత్ చార్జీలు పెంచాల్సిన అవసరం లేదని పేర్కొంది. విద్యుత్ చార్జీల ఖరారు పురస్కరించుకుని ఓఈఆర్‌సీ ఈనెల 23వ తేదీన ప్రత్యేక సమావేశం నిర్వహిస్తుంది. ఈ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ పంపిణీ చేస్తున్న సంస్థల సభ్యులు హాజరవుతారు. ఈ సమావేశంలో పరిశీలించిన అంశాల మేరకు కమిషన్ తుది నిర్ణయం ఖరారు చేస్తుంది.

విద్యుత్ కోతలు వద్దు

రాష్ట్రవ్యాప్తంగా పీక్‌లోడ్ అవర్స్‌లో విద్యుత్ కోత విధించవద్దని పంపిణీ సంస్థలకు ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్ర విద్యుత్ ఉత్పాదన సమర్థత 7,920 మెగావాట్లు కాగా, గరిష్ట విద్యుత్ డిమాండ్ 4,500–5,000 మెగావాట్లు. దీంతో అత్యధిక విద్యుత్ వినియోగం వ్యవధిలో విద్యుత్ కోత విధించకుండా నిరవధికంగా పూర్తిస్థాయి సరఫరాకు ఎటువంటి అడ్డంకి లేదని విద్యుత్ శాఖ మంత్రి ప్రతాప్ కేశరీ దేవ్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా లోవోల్టేజీ పీడిత ప్రాంతాల్లో వోల్టేజీని మెరుగుపరచడానికి మార్చి 2024 నాటికి 100 పైబడి 33/11 కేవీ సబ్ స్టేషన్లను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. 2030 సంవత్సరం నాటికి రాష్ట్రంలో 10,000 మెగావాట్లు పైబడి రెన్యువబల్ విద్యుత్ ఉత్పాదన లక్ష్యమని పేర్కొన్నారు. దీనికోసం ప్రత్యేకంగా రూ.50 కోట్ల బడ్జెటు కేటాయింపులతో ఒడిశా రెన్యూవబుల్ ఎనర్జీ డవలప్‌మెంట్ ఫండ్ కొత్త పథకం ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో అతి తక్కువ ధరకు గ్రిడ్కో పంపిణీ సంస్థలకు విద్యుత్ పంపిణీ చేస్తుందని విద్యుత్ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి నికుంజ బిహారీ ధల్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో డిస్కమ్‌లకు సగటున రూ.3.12/యూనిట్ ధరకు విద్యుత్ పంపిణీ చేసినట్లు తెలిపారు. గ్రిడ్కో ఆర్థిక సుస్థిరత రాష్ట్ర విద్యుత్ భద్రతకు కీలకమన్నారు.

‘ఉచిత న్యాయ సహాయం పొందాలి’



మాట్లాడుతున్న మీనాతీ బెహరా



శిబిరంలో పాల్గొన్న మహిళా న్యాయవాదులు, సోషల్ వర్కర్లు



మహిళా ఉద్యోగికి పురస్కారం అందజేస్తున్న కలెక్టర్ పండా

పర్లాకిమిడి: మహిళలు లోక్ అదాలత్ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందాలని రాష్ట్ర మహిళా ఆయోగ్ అధ్యక్షురాలు డాక్టర్ మీనాతి బెహరా సూచించారు. స్థానిక గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం సమావేశ మందిరంలో జిల్లాస్థాయి లీగల్ సర్వీసెస్ చైతన్య శిబిరాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళా స్వశక్తీకరణ, లోక్ అదాలత్ ఉపయోగపడుతుందో తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను మహిళలు వినియోగించుకోవాలని సనూచించారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖలలో గుర్తించిన పదిమందికి పురస్కారాలు కలెక్టర్ లింగరాజ్ పండా చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, కార్యనిర్వాహక అధికారి రామాంచల్ ఖమారి, డీఎస్పీ కైలాష్ చంద్ర బురుడా, జిల్లా సంక్షేమ శాఖ అధికారి మీనాతి దెయి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తప్పిపోయిన బాలుడి అప్పగింత


బాలుడిని చిన్నాన్న, మామయ్యలకు అప్పగించిన పోలీసులు

దత్తిరాజేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం గుమ్మకోట నుంచి తప్పిపోయి వచ్చిన బాలుడిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పెదమానాపురం ఎస్సై బి.భాగ్యం మంగళవారం తెలిపారు. పెదమానాపురం సంతతోట నుంచి రైల్వేగేట్ వైపు నడుచుకుంటూ వస్తున్న 10 సంవత్సరాల వయస్సున్న పాంగి ప్రసాద్ ఏడుస్తుండంతో గమనించిన స్థానికులు ఓదార్చి పోలీసులకు సమాచారం అందించారు. తల్లి మృతి చెందగా తండ్రి ఎక్కడున్నాడో తెలియదని బాలుడు చెప్పిన వివరాలు సేకరించిన పోలీసులు బాలుడి చిన్నాన్న పాంగి సింహాచలం, మామయ్య కంబడి త్రినాథలకు సమాచారం అందించారు. వారు మంగళవారం సాయంత్రం స్టేషన్‌కు రావడంతో బాలుడిని అప్పగించారు.

టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో గల గిరిజన గురుకులంలో ఖాళీగా ఉన్న 20 టీచర్ ఉద్యోగాలను 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీచేసేందుకుగాను డిగ్రీ, పీజీ కోర్సుల్లో ఉత్తీర్ణులై, టెట్ అర్హత ఉన్న ఇంగ్లీష్ మీడియం అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులనుంచి ఈనెల 28 సాయంత్రం 5 గంటలలోగా గురుకులం సెల్, ఐటీడీఏలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 31 నుంచి ఏప్రిల్ 1వ తేదీవరకు స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, జోగింపేటలో డెమో నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలనుంచి మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని స్పష్టం చేశారు.

ఆటో నుంచి జారిపడి మహిళ మృతి

కొత్తూరు: కొత్తూరు సాయిబాబా గుడి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తూరు సీహెచ్‌సీ పారిశుద్ధ్య కార్మికురాలు మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్‌కేపురం గ్రామానికి చెందిన నిమ్మక సావిత్రి(52) కొత్తూరు సీహెచ్‌సీలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తోంది. అనారోగ్యం కారణంగా మహార్తాపురంలో ఉన్న సోదరి ఇంటివద్ద ఉంటోంది. మంగళవారం ఆటోలో సీహెచ్‌సీకి వెళ్తుండగా డ్రైవర్ ఎడమ వైపున కూర్చున్న సావిత్రి వాహనం అతివేగం కారణంగా జారిపడింది. తీవ్రంగా గాయపడటంతో సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. మృతురాలి భర్త గొరేసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవింద తెలిపారు.

పోలీసు కుటుంబాలకు చెక్కుల అందజేత

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మరణించిన పోలీసుల కుటుంబాలకు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జి.ఆర్.రాధిక చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. అనారోగ్యంతో మరణించిన పోలీస్ కానిస్టేబుళ్లు కె.వి.రామకృష్ణ, చుక్కారావు, అప్పలనాయుడులే కాక రహదారి ప్రమాదంలో మరణించిన ఎస్.మల్లేశ్వరరావుల కుటుంబసభ్యులకు ప్రభుత్వం నుంచి మంజూరైన కార్పస్ ఫండ్ ప్రకారం ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున అందించారు. ఎల్లప్పుడూ పోలీసు శాఖ అండగా నిలుస్తుందని ఎస్పీ భరోసా ఇచ్చారు.

మరింత సులువుగా వైద్యసేవలు


ఆరోగ్యశ్రీ ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా మేనేజర్ డి. రాంబాబు

పార్వతీపురంటౌన్: ఆరోగ్యశ్రీలో మరింత సులువుగా వైద్యసేవలు పొందేలా చర్యలు చేపట్టామని పార్వతీపురం మన్యం జిల్లా ఆరోగ్యశ్రీ మేనేజర్ డి. రాంబాబు అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఆరోగ్యశ్రీ ఆస్పత్రులను పరిశీలించి అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల్లో సక్రమంగా వివరాలు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నడుపుతున్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో చికిత్సపొందిన అనంతరం ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న రోగికి వైద్య ఆసరా పథకం ద్వారా నగదు బ్యాంకు ఖాతాలో జమచేస్తున్నారని తెలిపారు. వైద్య ఆసరా పథకానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న బ్యాంకు అకౌంట్ల వివరాలను ఆస్పత్రుల వద్ద ఉన్న ఆరోగ్యమిత్రలకు అందజేసి నగదును ఖాతాల్లో పొందవచ్చన్నారు. ఎవరికైనా నగదు అందనట్‌లైతే తక్షణమే ఆరోగ్యమిత్రలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్యమిత్రలు ఉదయ్‌కిరణ్, వెంకటరమణ, సింహాచలం, శారద, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీ


పర్లాకిమిడి రాంనగర్‌లో హైటెక్ ప్లాజా వద్ద ముగ్గుల పోటీ విజేతతో న్యాయనిర్ణేతలు


గుసాని సమితి ఏడో మైలు వద్ద ముగ్గుల పోటీలో పాల్గొన్న కోర్పంద మహిళలు


గుసాని గ్రామంలో ముగ్గుల పోటీలకు విచ్చేసిన ఔత్సాహికులు, సమితి అధ్యక్షుడు వీర్రాజు


గారబంద గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక రాంనగర్ హైటెక్ ప్లాజా, గుసాని బ్లాక్ ఏడో మైలు, గారబంద, కాశీనగర్ ప్రాంతాల్లో రంగవల్లుల పోటీలను తిరుపతి పాణిగ్రాహి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా కోట్ని శోభారాణి, కిళ్లంశెట్టి ప్రశాంతి, జ్యోతి, పోట్నూరు స్వప్న, వి.రాధికా, లత తదితరులు వ్యవహరించారు. విజేతలకు ఉగాది పర్వదినం రోజున సినీనటులు సుమన్, బాబూమోహన్ చేతులమీదుగా బహుమతి ప్రదానం ఉంటుందని ఉగాది ఉత్సవాల కన్వీనర్ వీఎస్ఎన్ రాజు తెలియజేశారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు


మైత్రీ రేషన్ దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న కలెక్టర్ సింగ్

రాయగడ: స్థానిక పాత బస్టాండ్ వద్దనున్న పీడీఎస్ దుకాణం మైత్రీలో కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పేదలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యం నాణ్యత, పంపిణీ చేసే తీరుపై ఆరా తీశారు. లబ్ధిదారులకు సకాలంలో బియ్యం అందుతున్నాయో లేదో తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. పేదలకు పంపిణీ చేసే బియ్యంలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆర్టీసీ బస్సు-లారీ ఢీ

- ఐదుగురికి గాయాలు



హరిపురం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

మందస: మండలంలోని బిన్నలమదనాపురం సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. పలాస వైపు నుంచి ఇచ్ఛాపురం వెళ్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న మరో లారీ కూడా బస్సును ఢీకొంది. ముందు, వెనుక వైపుల నుంచి బలంగా రెండు లారీలు ఢీకొనడంతో ప్రయాణికులు భీతిల్లారు. బస్సు ముందు దెబ్బతినగా, డ్రైవర్ రమణ, కండక్టర్ ఉమామహేశ్వరరావులతో బస్సులో ప్రయాణిస్తున్న ఎల్.మేనక, జి.మీనాక్షి, బి.కుమారిలకు తీవ్ర గాయాలవ్వడంతో 108 అంబులెన్స్‌లో హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. డ్రైవర్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కండక్టర్‌ను టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే లైన్ పనుల పరిశీలన


పనులను పర్యవేక్షిస్తున్న జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ

భువనేశ్వర్: అంగుల్-సుకింద రైల్వే లైన్ ప్రాజెక్ట్ పనుల పురోగతిని తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ మంగళవారం సమీక్షించారు. బఘుపాల్ - బుధపాంక్ రైల్వే సెక్షన్‌ను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఆయనతో ఖుర్దా రోడ్ డివిజనల్ రైల్వే మేనేజర్ రింకేష్ రాయ్, ఈకో రైల్వే ప్రధాన కార్యాలయం, రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్ఎల్) ఉన్నతాధికారులు ఉన్నారు. రైళ్ల రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రాజెక్టు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులకు సూచించారు. ఖుర్దా రోడ్ రైల్వే డివిజన్ పరిధిలోని అంగుల్ జిల్లా బుధాపంఖ్ స్టేషన్, జాజ్‌పూర్ జిల్లా సుకింద సమీపంలోని బఘువాపలో స్టేషన్ మధ్య 92.825 కి.మీ పొడవైన బ్రాడ్ గేజ్ సింగిల్ ఎలక్ట్రిఫైడ్ రైల్వే లైన్ సెక్షన్ ఇటీవల గూడ్స్ ట్రాఫిక్ నిర్వహణకు అనుమతించినట్లు తెలిపారు. బుధాపంక్ స్టేషన్ (అంగుల్), బఘువాపలో (సుకింద) మధ్య బ్రాడ్ గేజ్ సింగిల్ రైల్వే లైన్ నిర్మాణం, నిర్వహణ కోసం రైల్వే మంత్రిత్వ శాఖ 2009లో ఫిబ్రవరి 20న ఏర్పాటు చేసిన స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ)లో భాగంగా అంగుల్-సుకింద రైల్వే లిమిటెడ్ (ఏఎస్ఆర్ఎల్) ఏర్పాటు చేసిందన్నారు. ఇనుప ఖనిజం సమృద్ధిగా ఉన్న జోడా-ర్బిల్ ప్రాంతాలను అంగుల్ ప్రాంతంలోని ఉక్కు, స్పాంజ్ ఐరన్ పరిశ్రమలకు కొత్త రైలు మార్గం ప్రత్యక్ష అనుసంధాన మార్గంగా నిలుస్తుందని తెలిపారు. కళింగనగర్ పారిశ్రామిక ప్రాంతాల్లోని బొగ్గు ఆధారిత థర్మల్ పవర్ ప్లాంట్లకు, తాల్చేర్ బొగ్గు గనుల బెల్ట్ మధ్య వేగవంతమైన రవాణాకు ఈ మార్గం దోహదపడుతుందని పేర్కొన్నారు. అంగుల్ ప్రాంతంలోని నాల్కో ఇతరేతర స్టీల్ ప్లాంట్లు విశేషంగా లబ్ధి పొందుతాయని వెల్లడించారు. కళింగనగర్ కాంప్లెక్స్ నుంచి ముంబై, ఢిల్లీ గమ్యస్థానాలకు ఖనిజ పదార్థాల రవాణా దూరం తగ్గుతుందన్నారు. ప్రస్తుతం ఖరగ్‌పూర్ మీదుగా కొనసాగుతున్న రవాణా తాల్చేర్ - సంబల్‌పూర్ - ఝార్సుగుడ మీదుగా మళ్లిస్తే వ్యయ భారం తగ్గి సమయం ఆదా అవుతుందన్నారు.

చీటింగ్ కేసుల్లో ప్రణాళికాబద్ధంగా దర్యాప్తు

- నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ ఎం.దీపిక



విజయనగరం క్రైమ్: దర్యాప్తులో ఉన్న చీటింగ్ కేసులను ప్రత్యేకంగా సమీక్షించి, చీటింగ్ కేసుల్లో దర్యాప్తును ప్రణాళికాబద్ధంగా, త్వరితగతిన పూర్తిచేయాలని ఎస్పీ ఎం.దీపిక పోలీస్ అధికారులను ఆదేశించారు. మాసాంతర నేర సమీక్షా సమావేశాన్ని జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సివిల్ తగాదాలపై వచ్చిన ఫిర్యాదుల్లో డాక్యుమెంట్లను పరిశీలించి, రెవెన్యూ అధికారుల సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో దర్యాప్తు త్వరితగతిన పూర్తిచేయాలని స్పష్టం చేశారు. నాన్ బెయిలబుల్ వారంట్లు న్యాయస్థానాల నుంచి వచ్చిన తక్షణమే ఎగ్జిక్యూట్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

రహదారి భద్రతకు ప్రాధాన్యం

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపైన, మద్యం మత్తులో వాహనాలు నడిపే వారిపైనా కఠినంగా వ్యవహరించి, కేసులు నమోదుచేయాలని చెప్పారు. రహదారి భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజలు, వాహనదారులకు హెల్మెట్ ధారణ, రహదారి భద్రత పట్ల అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో ఎస్ఈబీ అదనపు ఎస్పీ అస్మాఫర్హీన్, విజయనగరం ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ బి.మోహనరావు, దిశ మహిళా పీఎస్ డీడీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ డీఎస్పీ ఎల్.మోహనరావు, న్యాయ సలహాదారులు వై.పరశురాం, డీపీఓ ఏఓ వెంకటరమణ, సీఐలు, హెచ్‌సీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు

జిల్లా పోలీసుశాఖ విధులను సమర్థవంతంగా నిర్వహించి, దొంగతనం కేసులను ఛేదించిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ మేరకు వారికి ప్రశంసపత్రాలను, జ్ఞాపికలను అందజేశారు.


హాజరైన జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది

నేటి నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు


జగులై మాత శైల పుత్రి అలంకారం

భువనేశ్వర్: రాష్ట్రంలో బుధవారం నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవ్వనున్నాయి. ఖుర్దారోడ్ కుదియారి గ్రామ దేవ జగులై పీఠంలో ఈ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 9 రోజులపాటు జరిగే ఉత్సవాల్లో 9 రకాల అలంకారాలతో దేవీ దర్శనం లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు. నిత్యం ఉదయం సూర్యపూజ, సంధ్యవేళలో మహాస్నానం అనంతరం దేవీని అలంకరించి షోడశోపచారాల పూజాదులు నిర్వహించి చండీ పారాయణం కొనసాగుతుంది. ఈనెల 31వ తేదీ వరకు జగులై వసంత నవ రాత్రి ఉత్సవాలు జరుగుతాయి. శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కంద మాత, కాత్యాయని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిధాత్రి 9 అలంకారాల్లో దేవీ శోభిల్లుతుంది.

ఎన్‌సీసీ హెడ్ క్వార్టర్ ప్రారంభం



మాట్లాడుతున్న మంత్రి పూజారి

జయపురం: జిల్లాలోని జయపురంలో ఎన్‌సీసీ హెడ్ క్వార్టర్ కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒడిశా ఉన్నత విద్యామంత్రి రోహిత్ పూజారి మాట్లాడుతూ.. ఒడిశాలో ఎన్‌సీసీ హెడ్‌క్వార్టర్ కార్యాలయాల్లో ఇది నాల్గవది అని పేర్కొన్నారు. ఇప్పటివరకు బరంపురం, కటక్, సంబల్‌పూర్‌లలో హెడ్‌క్వార్టర్ కార్యాలయాలు ఉన్నాయని వెల్లడించారు. హెడ్‌క్వార్టర్ ఏర్పాటు వలన ఈ ప్రాంతంలో ఎన్‌సీసీ కేడర్ కార్యకలాపాలు బలోపేతమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యాలయం పరిధిలో నవరంగపూర్, 13వ ఒడిశా బెటాలియన్, రాయగడలో 2వ ఒడిశా గర్ల్స్ బెటాలియన్, జయపురంలో వన్ ఒడిశా ఐఎన్ఎఫ్ ఇన్‌డెప్‌కోయ్, భవానీపట్నం నేవల్ యూనిట్‌లు ఉంటాయని వెల్లడించారు. అనంతరం విక్రమదేవ్ అటానమస్ కళాశాల పరిసరాల్లో ఫైరింగ్ రేంజ్, అబస్టాకల్ కోర్సుల యూనిట్‌లను ప్రారంభించారు. జయపురం పారాబెడలోని పాత కోవిడ్ కేంద్రాన్ని ఎన్‌సీసీ హెడ్ క్వార్టర్ కార్యాలయంగా మార్చారు. భరిణిపుట్‌లోని వన్ ఒడిశా ఐఎన్ఎఫ్ ఇన్‌డెప్‌కోయ్ కార్యాలయాన్ని ఇక్కడికి తరలించినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో కొరాపుట్ జిల్లా కలెక్టర్ అబ్దుల్ మహ్మద్ అక్తర్, విభాగ ప్రిన్సిపాల్ కార్యదర్శి విష్ణుపద సెట్టి, ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ (డీడీజీ) కమాండర్ సోమెన్ బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం


సేనాపతి గణేష్ (ఫైల్)

కొత్తవలస: మండల కేంద్రంలోని విజయనగరం రోడ్డులో గల పీఎంఎల్ కాంప్లెక్స్ సమీపంలో మంగళవారం భారీ లారీ ఢీకొని కంటకాపల్లి గ్రామానికి చెందిన సేనాపతి గణేష్ (35) దుర్మరణం చెందాడు. ఈ ప్రమాదంపై స్థానికులు, పోలీసులు అందించిన వివరాలి లా ఉన్నాయి. గణేష్ స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంపై కొత్తవలస వస్తుండగా వెనుక నుంచి వస్తున్న భారీ లారీ ఢీకొట్టింది. దీంతో హెల్మెట్ తూలిపోయి గణేష్ రోడ్డుపై పడిపోగా లారీ వెనుక చక్రాలు తలపై నుంచి వెళ్లిపోయాయి. దీంతో తీవ్ర గాయాల పాలై రక్తస్రావం అధికంగా జరగడంతో గణేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు గణేష్‌కు భార్య హేమలత 4సంవత్సరాలు,ఒక సంవత్సరం వయస్సుగల బాబు, పాప ఉన్నారు. ఏసీ రిపేర్ పనులు చేస్తు గణేష్ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సమాచారం మేరకు ఘటనా స్థలానికి ఎస్సై బొడ్డు దేవి, ఏఎస్సై పి.రాజులు చేరుకుని శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

మరో ప్రమాదంలో ఆటో డ్రైవర్..

డెంకాడ: మండలంలోని మోదవలస గ్రామం వద్ద ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఆటోడ్రైవర్ నవిరి వెంకటరమణ(24) మరణించినట్లు హెచ్‌సీ సురేష్ తెలిపారు. సోమవారం అర్ధ రాత్రి సమయంలో విశాఖ నుంచి విజయనగరం వస్తున్న ఆటో ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో ఆటో డ్రైవర్ రమణ మరణించాడు. డెంకాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జలమే జీవనాధారం

- నీటిని పొదుపుగా వాడాలి
- నేడు ప్రపంచ జల దినోత్సవం


రాజాం: సంతకవిటిలో నేలబావిలో నీరు


రాజాం: రాజాం సమీపంలో నిండుకుండలా సాగునీటి చెరువు

రాజాం/విజయనగరం ఫోర్ట్: సమస్త ప్రాణికోటికి జలమే జీవనాధారం. అటువంటి జలవనరును పొదుపుగా వినియోగించుకోవల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉంది. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో నీటి సమస్యలు ఉండగా, విజయనగరం జిల్లాలో మాత్రం ప్రాజెక్టులు, నదులు ఎక్కువగా ఉండడంతో భూగర్భ జలాల సమస్య పెద్దగా లేదు. గతంలో పోల్చుకుంటే ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా భూగర్భజలాలు తగ్గుముఖం పట్టినప్పటికీ సేఫ్‌జోన్‌లోనే వాటర్‌లెవెల్స్ కనిపిస్తున్నాయి. ప్రస్తుతం వేసవి ఆరంభం కావడంతో చాలా ప్రాంతాల్లో సాగునీటి వనరులు అడుగంటుతున్నాయి. చెరువులు, బావుల్లో నీరు కిందికి దిగుతోంది. జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలాలు చేతికందేలా ఉన్నప్పటికీ రక్షణ చర్యలు చేపట్టకుంటే భవిష్యత్‌లో ఇబ్బంది వచ్చే పరిస్థితి కనిపిస్తుంది. నేడు వరల్డ్ వాటర్ డే సందర్భంగా జిల్లాలో భూగర్భ జలాలపై ప్రత్యేక కథనం.

ఆ ప్రాంతాలు మినహా..

జిల్లా వ్యాప్తంగా 4.96 మీటర్ల సరాసరిలో లెవెల్‌లో భూగర్భజలాలు ఉన్నాయి. ప్రధానంగా చీపురుపల్లి మండలం పరిధిలో 10 మీటర్లు, గరవిడిలో ప్రమాదకరంగా 12 మీటర్లు దాటి భూగర్భజలాలు అడుగంటాయి. 3 నుంచి 8 మీటర్ల లో లెవెల్‌లో వాటర్ లెవెల్స్ ఉండాలి. అంతకంటే లోపటికి నీరు వెళ్తే జలాలు అడుగంటుతాయని విశ్లేషకుల అభిప్రాయం. మెరకముడిదాం, వంగర మండలాల్లో 8 మీటర్ల అంచున లో లెవెల్స్‌లో భూగర్భ జలాలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో పంట పొలాలు అధికంగా సాగులో ఉండడంతో పాటు ఫ్యాక్టరీలు ఉండడం, భూగర్భజలాల కోసం అధికంగా నేలబావులు, బోరుబావులు వినియోగించడం ప్రధాన కారణంగా తెలుస్తుంది.

ఈ ఏడాది 3 మీటర్ల వ్యత్యాసం

గడిచిన నాలుగేళ్లలో ఫిబ్రవరి నెలలో జిల్లాలో భూగర్భజలాల సరాసరి లెవెల్స్‌ను పరిగణనలోకి తీసుకుంటే ఈ ఏడాది 3 మీటర్ల మేర జలాలు కిందికి దిగాయి. గత ఏడాది ఫిబ్రవరిలో జిల్లా వ్యాప్తంగా 1.83 మీటర్ల లోతులో నీరు ఉండగా, ఈ ఏడాది 4.96 మీటర్ల లోతులోకి నీరు ఇంకింది. వేసవి ఆరంభంలో ఇలా ఉండగా, వేసవి తీవ్రంగా ఉంటే ఈ లెవెల్స్ పడిపోయే పరిస్థితి ఉందని జిల్లా భూ గర్భ జలశాఖ జిల్లా అధికారులు పేర్కొంటున్నారు. బాడంగి, గజపతినగరం, గరివిడి, మెరకముడిదాం, ఎస్.కోట, తెర్లాం మండలాల్లో గత ఏడాది కంటే ఈ ఏడాది భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయి. ఈప్రాంతాల్లో నీటి వినియోగం పెరిగింది. నెల్లిమర్ల, సంతకవిటి, పూసపాటిరేగ తదితర ప్రాంతాల్లో వాటర్‌లెవెల్స్ గత ఏడాది కంటే పెరిగాయి. ఈ ప్రాంతాల్లో భూగర్భజలాల వినియోగం గతంలో కంటే తగ్గింది.

రెండుమీటర్లు లోతులోనే..

ఇదిలా ఉండగా జిల్లాలో విజయనగరం, సంతకవిటి, రేగిడి, గుర్ల, జామి, పూసపాటిరేగ, నెల్లిమర్ల, రాజాం, రామభద్రపురం, కొత్తవలస, గంట్యాడ తదితర ప్రాంతాల్లో రెండు నుంచి మూడు మీటర్లు లోతులోనే భూగర్భజలాలు ఉన్నాయి. వేసవిలో ఈ నీటి వనరులు ఇంత ఎత్తులో ఉండడంతో వర్షాకాలంలో అవి మరింత మీదకు వచ్చే అవకాశం ఉంది. ఈప్రాంతాల్లో ఇలా బోర్లు వేయగానే నీరు వచ్చిపడుతుంది.


విజయనగరం ఫోర్ట్: జలజీవన్ మిషన్ ద్వారా ఇంటి వద్ద వేసిన కుళాయి

తాగునీటి పథకాల వివరాలు

జిల్లాలో 27 మండలాల్లో 779 గ్రామ పంచాయతీలు, 1,621 మధుర గ్రామాలు ఉన్నాయి. వాటి పరిధిలో సీపీడబ్ల్యూ స్కీమ్‌లు 938 గ్రామాలకు తాగునీరు అందించేవి 30 ఉన్నాయి. పీడబ్ల్యూ స్కీమ్స్ 965 ఉన్నాయి. ఎంపీడబ్ల్యూ స్కీమ్స్ 184 ఉన్నాయి. నేరుగా తాగునీరు అందించే పథకాలు 408 ఉన్నాయి. బోర్లు 14,080 ఉన్నాయి. వాటి ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. గతంలో 40 నుంచి 50 ఇళ్లకు ఒక కుళాయి ఉండేది. కానీ ప్రస్తుతం ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ద్వారా నీటిని అందిస్తున్నారు.

నీటి లభ్యతను పెంచాలి



జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇచ్చి నీటిని అందజేస్తున్నాం. నీటి లభ్యతను పెంచేవిధంగా ప్రతి ఒక్కరూ చర్యలు చేపట్టాలి.
– బి. ఉమాశంకర్, ఎస్ఈ ఆర్‌డబ్ల్యూఎస్

గత నాలుగేళ్లలో జిల్లాలో భూగర్భజలాల సరాసరి

సంవత్సరం - భూగర్భ జలాల సరాసరి

2020(ఫిబ్రవరి) – 2.763 మీటర్లు లెవెల్
2021(ఫిబ్రవరి) – 3.51 మీటర్లు లెవెల్
2022(ఫిబ్రవరి) – 1.83 మీటర్లు లెవెల్
2023(ఫిబ్రవరి) – 4.96 మీటర్లు లెవెల్